
# విక్రమార్క సింహాసనం

ఎమ్. ఆర్. ప్రసాద్ రంజన్




మధ్యాహ్నం, రేడియో 'వివిధ భారతి' ఆగిపోయింది. దాని ముందు నుంచి లేచి ఒకసారి ఒళ్ళు విరుచుకున్నాను. ఇంగ్లీషు సినిమా ఏదైనా ఉంటే పోదామనుకున్నాను గానీ యేమీ లేక పోవడంతో ఆ ఆలోచనకు స్వస్తి చెప్పి, ఏదన్నా కథ రాద్దామనుకుని కాయితాలు ముందు పడేసుకు కూర్చున్నాను. కథా వస్తువేం తట్టకపోవడంతో 'కాఫీ చేయమని' ఒక్క కేక పెట్టాను. అమ్మ కాఫీ తెచ్చే దాకా ఆలోచిస్తూనే ఉన్నాను. ఆలోచన ఒక్కటీ నిలకడగా కుదరడం లేదు. ఒక్క క్షణం ఒక దాని గురించి ఆలోచిస్తే, మరో క్షణంలో ఇంకో విషయం మీదికి మారిపోతుంది. రెండో కప్పు కాఫీ కూడా ఖాళీ చేశాను. వక్కపొడి నోట్లో వేసుకుని టేబిల్ ఫాన్ 'ఆన్' చేసి పడుకుని, మా కాంపౌండ్ గేట్ వైపు చూస్తూ ఆలోచన ప్రారంభించాను.

కునుకు పట్టబోతుండగా "సార్" అనే కేక వినిపించింది. నేను పట్టించుకోలేదు. మళ్ళీ "సార్.. సార్...." అని ఆ సుదీర్ఘమైన కేకలు వినిపించసాగాయి. విసుగుతో కళ్ళు తెరిచాను.

దెబ్బతో మత్తు వదిలింది.

ఎదురుగా గ్లాస్కో పంచె, సిల్కు జుబ్బాలతో మా 'కరక్కాయి పంతులు' ప్రత్యక్షం! 'చచ్చాన్రా భగవంతుడా' అనుకోకుండా ఉండలేక పోయాను!

ఇప్పుడు ఆయన్ని పరిచయం చెయ్యడం ఎంతైనా అవసరం! ఆయన అసలు పేరేమిటో గానీ, ఎవ్వరూ ఆ పేరు ఉపయోగించగా విన్లేదు నేను. ఆయనా మాలాగే వూరికి కొత్తవాడు. చూడడానికి చాలా వింతగా ఉంటాడు. కలుపుగోలు మనిషి. కొత్తా పాతా లేకుండా అందరితోనూ సరదాగా మాట్లాడ గలడతను. కానీ ఒక్కటే చిక్కాయనతో ఎదుటి మనిషి తన మాటలంటే సుముఖంగా ఉన్నాడా, విసుగుతో చస్తున్నాడా అనేదృష్టి ఆయనకు అసలు ఉండదు! అలాగని అతణ్ని ఆ అమాయకుడని అనగలమా ?. . . . చెప్పలేం.

ఆయన పూర్వాశ్రమంలో రాజకీయాలలో పాల్గొని శ్రీ కృష్ణ జన్మస్థానాన్ని దర్శించి ఉండవచ్చునని మా తమ్ముడి అభిప్రాయం! లేక పోతే— ఏ విషయమ్మీదైనా అంత ధాటిగా (ఒక్క చుక్క సారం లేకుండా అనేది ముఖ్యం!) ఉపన్యాసం దంచగలడా ?

"నాన్నగారున్నారబ్బాయ్ !" అనడిగాడు— నన్ను తన గురించి ఇక రాయడానికి అవకాశమివ్వకుండా.

ఒక్కసారి ఉలిక్కిపడి— 'లేరండీ' ! అన్నాను.

నిజానికి నాన్నగారు మేడమీద పడుకొని నిద్రపోతున్నారు అసలే ఆయన రెండు వేల మంది విద్యార్థుల ఫలితాలు విన్ననే ప్రకటించడంలో బాగా అలసిపోయారు. ఇవాళయినా కాస్త తెరిపి ఇస్తే మంచిదని తడుముకోకుండా అబద్ధ మాడేశాను. అదీ కాక ఆయన నిన్నటి వరకూ పడ్డ అవస్థంతా ఒక యెత్తూ, కరక్కాయ పంతులుతో ఇక మాట్లాడడం ఒక యెత్తూను.

"ఎక్కడికి వెళ్ళారు ?"

"తెలీదండి !"

"అయినా ఇంత యెండలో యెక్కడికోయ్ ? ఎంత హెడ్మాస్టరు గిరీ అయినా అంత అవసరం ఉంటుందా ?.... పోనీ, యెంత సేపట్లో వస్తారంటావ్ ?" అన్నాడు పంతులు.

"అదీ చెప్పలేనండి !" అన్నాను ఎలాగైనా ఇతణ్ని సాగనంపుదామని. కానీ కరక్కాయ పంతులేం తక్కువ తిన్న వాడు కాదు. ఉసూరుమని నిట్టూర్చి "వెధవ యెండ !" అని తనలో తను గొణుక్కుంటూ వరండాలో ఉన్న పడక్కుర్చీలో కూలబడ్డాడు. "హతవిధీ" అనుకుంటూ, ఆయన మంచినీళ్ళు అడక్కుండానే, ఒక మరచెంబెడు నీళ్ళూ, ఓ స్టీలు గ్లాసూ ఆయన పక్కనే, పెట్టాను. నేను లోపలికెళ్ళి కూర్చున్నాను.

అంతలో ఆయన— "అబ్బాయ్, ఓ మాటిటు వస్తావ్ ?" అన్నాడు.

ఒక్కసారి నిట్టూర్చి ఆయన కెదురుగా వెళ్ళి నిలబడ్డాను.

"ఎంత హాయిగా ఉందోయ్ ఈ పడక్కుర్చీలో? పాతకాలందైనా చాలా బావుంది! నువ్ నమ్మవ్ గానీ ఎంత అనుకూలంగా ఉందనుకున్నావ్ ?.... నాన్నగారికీ కుర్చీ అంటే చాలా ఇష్టమనుకుంటా! అయినా హెడ్మాస్టరు దర్జాకిలాంటి చోటుండాలోయ్ ?...." ఆయన పడక్కుర్చీలో తాపీగా కాళ్ళు చాపి, ముందుకూ వెనక్కీ వూగుతూ మాటాడుతున్నాడు.

"ఇది చెప్పడానికా పిల్చాడు ?" అని తిట్టుకున్నాను లోలోన.

"అబ్బాయ్! కాసిని మంచినీళ్ళు తెచ్చిపెడతావ్?"

"తెచ్చి మీ పక్కనే పెట్టాను కదండీ !" అనబోతుండగా 'భళ్ళున' నవ్వాడాయన.

"మరచెంబు నీళ్ళా? ఏ మూలకోయ్ ? !" అన్నాడు బొజ్జ తడుముకుంటూ.

అంతవరకూ మరచెంబు వైపు చూళ్ళేదు నేను. చూడగానే ఆశ్చర్యంతో అలాగే ఉండిపోయాను. ఆ మరచెంబులో ఒక్క చుక్క నీరు మిగిలి ఉంటే ఒట్టు !

ఏం చేస్తాను, మళ్ళీ ఇంకో చెంబుడు నీళ్ళు తెచ్చి పెట్టాను.

"ఇప్పుడప్పుడే దారంటున్నావ్ కదా ?.... అంత దూరం.... పాత టౌను నుంచి కాళ్ళీడ్చుకుంటూ వచ్చానే ?.... ఎలాబ్బా ?" అన్నాడు. నేనప్పుడే గ్రహించాను. పంతులు కాఫీ టిఫిన్లకు ప్లాను వేస్తున్నాడని. ఓ పత్రికను తీసుకు వచ్చి ఆయన (మొహాన)కి పడేసి, లోపలికి వెళ్ళి కూర్చున్నాను. అంతలో వంటింట్లోంచి కమ్మగా పకోడీల వాసన రావడం మొదలయింది. అందాకా పత్రికను తిరగేస్తున్న పంతులు గభుక్కున దాన్ని మూసేసి నోరు చప్పరిస్తూ ఆ పత్రికను విసనకర్రగా చేసుకున్నాడు. "పాపం" అనుకున్నాను. నిజం చెప్పాలంటే నాకూ నోరూరుతోంది !.... మళ్ళీ కథకు 'ప్లాను' ఆలోచించడం మొదలెట్టా. పంతులెంత తొందరగా వెళ్ళిపోతాడా ? అన్న ఆలోచనే గానీ మరో ఆలోచన నా మనస్సు దరిదాపులకు కూడా రావడం లేదు. ఆయనకు కనిపించకుండా కూర్చుని కిటికీలోంచి బైటకు చూస్తూ మళ్ళీ ఆలోచించడం ప్రారంభించాను.... ఎప్పుడూ అబ్బాయిలూ, అమ్మాయిలూ వాళ్ళ ప్రేమాయణాలూ లేకుండా కథా వస్తువులు దొరకడం లేదు. అలాంటి ప్రేమాయణ గాథలు రాయడం నా కిష్టం లేదు. కొత్త రకం ప్లాను కోసం చూస్తున్న నాకు అలాటేం కథా వస్తువులు దొరికే సూచనలు కనిపించడం లేదు !....

ఉన్నట్టుండి మా కాంపౌండు గేటు ఓ మాటు తెరుచుకున్న చప్పుడు వినిపించింది. అటు చూశాను. ఎవరో ఒక గళ్ళ షర్టాయన చకచకా నడుస్తూ వచ్చి, 'అటెన్షన్' పోజులో నిల్చుని పంతులు గారికి ఒక సెల్యూటు పారేశాడు. పంతులు ఆశ్చర్యంతో కళ్ళప్పగించాడు. బహుశా తన మొహానికి సెల్యూట్ చేసేవాడొకడా అనికాబోలు ఆయన ఆశ్చర్యం ! గళ్ళషర్టు శాల్తీ పంతుల్నే హెడ్మాష్టరనుకున్నట్టుంది. పంతులు అది గ్రహించినవాడై, ఇంట్లో పలికో మాటు, చూశాడు. అంతలో నే నతనికి కనిపించకుండా సర్దుక్కూర్చున్నాను.

ఎవరూ కనిపించక పోవడాన్నేమో— ధైర్యంగా ఓ మాటు గొంతు సవరించుకొన్నాడు.

"ఏం కావాలండీ !" అని తనే హెడ్మాష్టు

కలయనట్టు గంభీరంగా అడిగాడు ఆ వచ్చిన వ్యక్తిని. అతణ్ని కూర్చోమని కూడా చెప్పలేదు?

"మా అబ్బాయి విత్ హెల్డయ్యాడు! అంటే ....'' చెప్పబోయాడతను.

పంతులికి హఠాత్తుగా కోపం వచ్చేసింది.

"అయ్యా, 'విత్‌హెల్డంటే' — మీ అబ్బాయి గారు బడికి సున్న చుట్టాడూ క్లాసులకు ఎగనామం పెట్టాడూ— అని'' గట్టిగా అరిచాడు పంతులు.

అదిరి పడ్డాడా వచ్చినాయన. తమాయించుకొని—

"దాన్ని సవరించడానికేదేనా మార్గముందంటారా సార్!'' అని అడిగాడు.

"మార్గమా ?.... ఏ మార్గమూ లేదు. ఈ తెలివి మీకు ముందరే ఉండాలి. కుర్రాడు సోమరిపోతై, గడుగ్గాయి ఐ బడి ఎగగొడ్తున్నప్పుడు శ్రద్ధ తీసుకోరు! తీరా వాళ్లు 'విత్‌హెల్డ్' అయ్యాక దాపురిస్తారు మా ప్రాణాలకు! ఛీఛీ... ఏం మనుష్యులో ? !....'' పంతులు విసుగుదలా, కోపమూ తార స్థాయినందుకొన్నాయి.

"అది కాదండీ!....'' ఆయనేదో చెప్పబోయాడు గానీ పంతులది వినిపించుకొనే ధోరణిలో లేదు.

"ఏది కాదండీ ? మూణ్నెల్ల పరీక్షలప్పుడు, అర్ధ సంవత్సరం పరీక్షలప్పుడూ ప్రోగ్రెస్ రిపోర్టులో ఎటెండెన్సు తెలపడం లేదా ? అప్పుడు మీరేం చేస్తున్నట్టు ? అంతా అయ్యాక్గానీ అవతరించరు!.... ఇప్పుడో డాక్టరు సర్టిఫికేట్ తేవాలా? అత్తెచ్చాక దాన్ని మరో ఇలాంటి పది కాగుల్తో కలిపి డి.ఈ.ఓ గారికి పంపాలా ? పంపేప్పుడు దాంతో పాటు లేనిపోని ఇంత రిపోర్టొకటి వెలిగించాలా ?... అబ్బబ్బబ్బబ్బా!.... తల్లి తండ్రులు జాగ్రత్త తీసుకోక పోవడం ఈ వూళ్లో మరీ యెక్కువగా ఉంది!''

"నా మాటల కాస్త వింటారా మాష్టారూ?'' —ఇక లాభం లేదని గ్రహించిన గళ్ళ చొక్కా పెద్ద మనిషి వినుగ్గా అన్నాడు— "మాకు కర్నూలు నుంచి ఇక్కడకు బదిలీ అయింది. మూణ్నెల్ల పరీక్షలూ అర్ధసంవత్సరం పరీక్షలూ అక్కడే రాశాడు. అందువల్ల మీ గుమాస్తాకు చెబితే ఆ స్కూలు నుంచి పై రెండు పరీక్షల మార్కులూ తెప్పించుకునేటప్పుడు ఎటెండెన్సు కూడా తెప్పిస్తామన్నారు!'' అర్థమైందిటోయ్ పంతులూ— అన్నట్టు మొహం పెట్టాడు.

వెలక్కాయ అడ్డుపడింది పంతులు ధోరణికి. అయినా— "ఆ మాట మొదటే యెందుకు చెప్ప లేదండీ ?'' అన్నాడు.

"మీరు వినిపించుకొంటే కదండీ!''

పంతులికి మళ్లీ ఎక్కళ్లేని కోపమూ ఉబుంచుకు వచ్చింది. "నేనేటయ్యా వినిపించుకోంది ? అప్పట్నుంచీ పత్రికన్నా ముట్టకుండా నీ గోడే పట్టించుకొన్నానే ?... పూ సర్లే! బడి తెరిచాకరా! ఆ స్కూలు నుంచి 'డేస్' తెప్పించి అలాగే చేద్దాం!'' కనీస మర్యాదైన బహువచన ప్రయోగం కూడా మర్చిపోయాడు పంతులు కోపంలో.

"అయితే మా వాడు ప్యాసయినట్టే నాండీ ?''

"బాబోయ్! మీకు చెప్పలేక చస్తున్నాను. 'విత్ హెల్డంటే' త్రిశంకు స్వర్గం లాంటిది! అటూ కాదు ఇటూ కాదు! స్కూలు తెరిచాక అన్నీ తెలుస్తాయి ?''

అతగాడు "అలాగేసార్'' ! అంటూ ఓ సెల్యూట్ పారేసి, ఎన్సీసీ వాడిలా నడుస్తూ కాంపౌండు గేటు వెయ్యకుండానే వెళ్లిపోయాడు.

కరక్కాయ పంతులు మళ్లీ లోనికో మాటు చూసి, గంభీరంగా మీసం మీద చెయ్యి వేసుకుని దరహాసం చిందించాడు. నాకు పెద్దగా, హాయిగా నవ్వాలనిపించింది. కానీ బావుండదని నాలో నేనే చిన్నగా నవ్వుకున్నాను.

అంతలో— బిగుతు పైజామా, వదులు, షేర్వాని తొడుక్కుని తలమీదాకో నల్లటి కుచ్చు గల ఎర్రటోపీ పెట్టుకుని హుందాగా ఉన్న ఒక గడ్డపు సాయిబు ప్రవేశించాడు.

పంతులు ప్రశ్నార్థంగా మొహం పెట్టాడు.

"సలామలేకుమ్! సలామలేకుమ్!....'' అన్నాడా సాయిబుగారు.

"ఏం కావాలి ?''

"ఏం లేదూ సాబ్! మా కుర్రవాడు సెకండ్ ఫారం చదువుతున్నాడు. వాడి రిజల్టు నా కర్థం గావడం లేదు.''

"మీరంటున్న దేవిటో నా కర్థం కావడంలేదు. రిజల్టర్థం కాక పోవడమేమిటండీ ?'' ఆశ్చర్యం ప్రకటించాడు పంతులు.

"మా వాడి క్లాసులో ఇద్దరు హుసేన్లున్నారు సాబ్! అందులో ఒకడు పాస్ ఒకడు ఫేల్!.... అందుకని....'' ఆగిపోయాడు ఆ సాయిబు పంతులు 'పోజు' చూసి.

"బావుందయ్యా! నన్ను ఫైళ్లు తిరగెయ్యమన్నావా? నేనేమన్నా క్లర్కు ననుకున్నావటయ్యా? అయినా హుసేన్లు ఇద్దరున్నప్పుడు మీ వాడికి హుస్సేన్‌ఖాన్ అనో, సయ్యద్ హుసేన్ అనో, హుసేన్ భాషా అనో,— ఇవేవీ దొరక్కపోతే హుసేన్ శాస్త్రి అనో శర్మ అనో తగిలించెయ్యకూడదటయ్యా ? ప్రతి దానికీ ఇలా గొడవ చేస్తే యెలా ?

"ఆ పనివాళ్లే చెయ్యగూడదా సాబ్ ?'' అన్నాడు సాయిబు తన తప్పేం లేనట్టు.


"మీకెంతగా ఈ విషయం పట్టిందో వాళ్లకీ అంతే పట్టింది! పరేగానీ మీ వాడికి తెలీదా తన పేరెవరి పేరు వ్రాత వస్తుందో ? ఎటెండెన్సు నెంబర్లు కూడా వేశారు కదుటయ్యా ?'' తీక్షణంగా చూశాడు పంతులు.

"అదంతా మాకెలా తెలుస్తుంది సాబ్? మీరెలాగన్నా మా వాడు ప్యాసయ్యేట్టు చూడాలి! ఒక వేళ మా వాడే ఫేలయి ఉంటే వీడి పేరునే ఆ హుసేన్‌గాడి పేరుతో బదలాయించండి! .... ఎంత డబ్బు ఖర్చయినా ఫర్వాలేదు ?'' అంటూ జేబులోంచి కొన్ని కొత్త పచ్చనోట్లు బైటకు తీసి చూపించాడు.

దాంతో అదిరి పడ్డాడు పంతులు, నిలువెల్లా వణికి పోయాడు, "సాయిబూ! నువ్వెక్కణ్నుంచి వెడతావా ? పోకర్ని కేకేయ మన్నావా ?'' అని గట్టిగా అరిచాడు.

సాయిబు బైటకు ఉడాయించేశాడు.

నాన్నగారు గనక మేల్కొని ఉన్నట్టయితే ఆ సాయిబుగాడి కొక్కా వినిగేదే ! తప్పించుకొన్నాడు. లక్కీ ఫెలో!.... మనసారా నవ్వుకొన్నాను.



పంతులొకమాటు అతిభారంగా నిట్టూర్చి, విజయగర్వంతో మొహం కళకళ లాడగా, హెడ్ మాస్టరు దర్జా ఉట్టి పడేట్టు కాళ్లు జాపి పడుకున్నాడు— పడక్కుర్చీలో. "ఇంకా టిఫిన్ రాలేదే ? ఇంకా నాలుక్కాలేదా ?'' అని తనకు సంక్రమించిన తాతల నాటి గడియారాన్ని కోటు జేబులోంచి బైటకు తీశాడు. అంతలో— అది రోజుకు రెండుసార్లే సరియైన టయిము చూపించ గలదని స్ఫురణకు వచ్చి మళ్లీ లోపలకు నెట్టేశాడు. పత్రిక తెరిచాడు. అప్పుడప్పుడూ చూపరినైన నాకు వింత గొలిపేట్టు 'భళ్లు భళ్లు'న నవ్వేస్తున్నాడు. "కార్టూన్లు చూచి కాబోలు— సెన్సాఫ్ హ్యూమరుండే మనిషికే ? ?'' అనుకున్నాను—

పది నిముషాలు గడిచాయో లేదో— వీధిలో సందడి వినిపించింది. ఏమిటా అని చూద్దును గదా !— చిన్న సైజు దొడ్డ దొలరు లాంటి ఓ (అ)పూర్వ మనాసిని అడ్డంగా గేటులోకి

కూర్చోడానికి అవస్థ పడుతూ చివరికి గేటు గుండా దారి చేసుకుని, తనవెంట ఒక పది పన్నెండేళ్ల కుర్రాణ్ణి బరబరా ఈడ్చుకొంటూ వచ్చి, పంతులు కుర్చీకి వాలుగడుగుల యెడంగా నేలమీద చతికిల బడింది.

అందాకా పంతులు వింతగా చూస్తుండి పోయాడు. నోట మాట రాలేదు. ఆమెను చూసి కాస్త జంకినట్టు కనిపించాడు. ఇంకా 'సంగతేమి' టని అడక్కముందే బొడ్లోంచి ఒక కాయితపు పొట్లం తీసి— "ఇంద నాయనా.... తిరుపతి ప్రసాదం !" అని పంతులికి సమర్పించుకొంది. పంతులామె వైపోకవమాటు చూసి యేమీ మాట్లాడకుండా ఆ పొట్లంలోంచి ఓ చిన్న (! ! !) లడ్డును నోటి కెత్తాడు !.... "ప్చ్" అని నా దురదృష్టాన్ని నిందించుకొన్నాను.

పంతులు లడ్డును నోటో పెట్టుకోడంతోటే, ఆవిడ ముక్కు మీద వేలేసుకుని, నోటిని సాగదీసి— "హవ్వ !.... ఇదేం అన్యాయమండీ ?" అంటూ రాగాలాపన మొదలెట్టింది.

నేనూ ఉలిక్కి పడ్డాను. "పొరబాటున ప్రసాదం కళ్లకద్దుకుని తినలేదు గాబోలు ?" అనుకున్నాను.

పంతులు గొంతులోని లడ్డు నోట్లోకి వచ్చేసింది. పెంకులున్నాయా లేదా అన్నట్టు అనుమానంగా పై కొకమాటు చూసి, గభాలున లడ్డును కాస్తా మింగేసి,—"ఇంతకీ యేమిటమ్మా సంగతి!" అని ప్రశ్నించాడు.

"జరిగి జరిగి ఇలాంటిది ముత్యాల్లాంటి నా ముగ్గురు మనమలకే జరగాలా నాయనా !.... ఇదేం కలికాలం రోయ్ భగవంతుడా ?.... నా మనవళ్లకే ఇలా అయిందేమిట్రోయ్ !" అంది శోకాలు తీస్తూ లేని కన్నీళ్లను వత్తుకొంటూ.

"ఏమైందమ్మా నీ మనవళ్లకూ ?" హడలిపోయిన పంతులు ఇంట్లోపలికి చూస్తూ అడిగాడు.

"అదేటో నాయనా ! వాళ్ల ముగ్గురికీ '(ఫెయిలూ' అని బోర్డు మీద వేశారుట. పాసని గానీ ఫేలనిగానీ వెయ్యలేదుట !"

"ఏమిటమ్మా ఏమని వేశారూ ?" అన్నాడు పంతులు ఆశ్చర్యంగా.

నిజానికి నాకూ అర్థం కాలేదు అదేమిటో ! బిడియం లేకుండా చెప్పొద్దూ !

"అదేదో (ఫెయిలూ, ఫెయిలూ అన్నాడమ్మా మా చిట్టి బాబు !"

"ఓ.... డిఫెయిల్డా!" కనిపెట్టే శాడు పంతులు.

నిజంగా అతన్ని మనసులోనే అభినందించాను అంత సులభంగా కనుక్కున్నందుకు.

"అవున్నాయనౌన్నాయన ! అదేదో కాస్త చూడు. పెద్ద ముండని... అలా అంటే ఏమయిన్నట్టు నాయనా ?"

"డిఫెయిల్డంటే ఫెయిలేనమ్మా !"

"ఆఁ !" అంటూ విస్తు బోయిందావిడ.

"అదేవిట్నాయనా ? ఫెయిలూ అని బోర్డు మీద వేసి ఫెయిలంటావా ? ఇదేం అన్యాయం తండ్రీ, ఎప్పుడూ వినవైనా లేదు ! ఫెయిలయి ఉంటే లక్షణంగా ఫెయిలూ అని రాయక (ఫెయిలూ అని యెందుకు రాశారంట !.... .... అంటే నా ముగ్గురు మనవలూ ఫెయిలయినట్టేనా.

# విక్రమార్క సింహాసనం

అవ్వ.. అవ్వ ! చచ్చేలా రాత్రి తొమ్మిదింటి దాకా కూతేసి చదివించేదాన్ని ! మా స్కూలు మాస్టారి దగ్గరికే ప్రైవేటుకి పంపేదాన్నే ! దరిద్రుడు ! ఆ మేష్టరెలాంటి వాడూ ? లక్షణంగా ఏ వంకా లేకుండా నెల నెలా టంచన్‌గా నాలుగు నెల్లపాటు నా కష్టార్జితమైన కరుకు రూపాయలు ఇరవై ఇరవై తిన్నాడే ! వెధవ— నాలుగు మార్కులు వేయొద్దామన్న బుద్ధి ఉందీ ? విశ్వాస ఘాతకుడు... కానీ వాడివని తర్వాత చెబుతా !.... మాణ్నాయనా! ఎలాగోలాగు మా వాళ్లను పాస్ చేయించండి ! దయచేసి !.... ఏదో పెద్దదాన్ని చెబుతున్నాను !..!

"అదేమిటమ్మా— అలాగంటావ్ ? ఫెయిలయిన వాళ్ల నెవడన్నా పాస్ చేయించగలడా ?"

"నాయన్నాయనా— అలాగనకు ! హెడ్మాస్టరు పదవి అంటే యెంత గొప్పది !...." అంటూ చాలా పొగిడేసింది. పంతులు తైరుసడే అయిపోయాడు.

"నిజమే నమకో !.... కానీ ఇప్పుడేం చెయ్య లేనమ్మా !" అన్నాడు సానుభూతిగా. ఆవిడ పొగడటంతో ఆమె మీదేదో గౌరవ భావం ఉదయించినట్టుంది పంతులికి. ఆ భావం ఆ కంఠంలో స్పష్టంగా వినిపించింది నాకు. తను నిజంగా హెడ్మాష్టరే అయి ఉంటే తప్పకుండా ఏదో చేసేవాడేమో!

"కనీసం ఇద్దర్నన్నా పాస్ చేయించండి బాబూ! చంటాడు చూడండి యెంత ముద్దొస్తున్నాడో !" అంటూ వాణ్ణి ముద్దు పెట్టేసుకుంది. ఆవిడకు అంత ముద్దొస్తున్నాడేమో గానీ పంతులికీ, నాకూ మాత్రం భయంవేసింది వాణ్ణి చూడగానే పంతుల్నే కొట్టే వాడిలా కనిపించాడు.

"వీణ్ణి చూసైనా ఏదో ఒకటి చేయించండి బాబూ ? మీకు నేను చెప్పేదాన్ని కాదు !.... ఎలాగైనా.." సాగదీసింది.

"ఇది మరీ బావుంది. ఫెయిలైన వాళ్లకేవడేం చేస్తాడమ్మా ! మీ రెన్నైనా చెప్పండి ? కంఠ శోషే గానీ యేం లాభం లేదు !" పంతులు భయపడ్డానే నిక్కచ్చిగా అనేశాడు.

"అలాంటే యెలా నాయనా !.... మన అమ్మడికి నిన్న అవగాయ వద్దు వద్దంటుంటే కూడా ఇచ్చాను ! మిమ్మల్నయితే చూశాలేదు గానీ అమ్మడు వాళ్లంటే నా కెంత అభిమానం !.... ఏం నాయనా కాస్త చూడ్డూ !" బంకమన్నులా తయారయిందావిడ.

"లాభం లేదండీ బామ్మగారూ లాభం లేదు. ఫెయిలయిన వాళ్లను బ్రహ్మ కూడా పాస్ చేయించలేడు ? మార్కులు దిద్దడం వాడివల్ల కూడా కాదు. మీ రనవసరంగా శ్రమ పడుతున్నారు" పంతులు గట్టిగా అన్నాడు.

"పోనీ నాయనా, సెకండ్ లిస్టయినా ఉంటుందా ?"

"ఉండవమ్మా ఉండవ్— అలాంటి వెప్పుడూ జరగవ్ !"

"అదేవిట్నాయనా ! మా వాళ్లంతా పోయిన సంవత్సరం సెకండ్ లిస్టులోనేగా పాసయింది !"

"అలాంటివి జరగడానికిది పోయిన సంవత్సరం కాదు గదమ్మా !"

"ఏం చోద్యమో నాయనా. కనీసం మా వాడి మార్కులన్నా చూపిస్తావా ?"

"మార్కులు బడి తెరిచాక చెబుతారు బామ్మగారూ !"

"అదేవిట్నాయనా మరీ వింత !" అంటూ నోరు నొక్కుకుంది. "మా వాడి మార్కులు మేం జూసుకోడానికి బడితెరవాలా ? మార్కులన్నా తెలిస్తే యెందులో తక్కువచ్చాయో ఆ మాష్టార్ని పట్టుకుని దులుపుదును ?" అంటూ పంతుల్నే దులిపేలా తయారైందావిడ.


"బామ్మగారూ మీరిక వెళ్లి రేపు ఉదయం పదింటికి రండి. ఇక్కడికి కాదు. ఆఫీసుకి! ఇంట్లో ఆఫీసు ఫైళ్లుంచుకో కూడదు. అక్కడ క్లర్కు మీ క్కావలసిన విషయాలన్నీ చెబుతాడు. దయచేసి మీరు వెళ్లిరండి !" బతిమాల సాగాడు పంతులు.

"అంతేనంటారా ?" జాలిగా అడిగింది.

"అంతేనమ్మా అంతే! ఇక మీరు వెళ్లిరండి !" గేటువైపు చెయ్యి చూపించాడు.

ఆవిడ కోపంతో మండిపోతూ ఏదో గొణుక్కుంటూ ఎలాగో కష్టపడి వచ్చిన దార్నే తిరిగి వెళ్లిపోయింది. కుర్రాణ్ణి ఈడ్చుకుంటూ !

"హమ్మయ్య !"— కరక్కాయ పంతులు




ఐటెక్స్ కాటుక
ఐటెక్స్ బిందీ
శాస్త్రీయముగా తయారుచేయబడినవి.




అరవింద్ లేబరేటరీస్
పి. బి. 1415, మద్రాసు-17.

ఎలెక్ట్రిక్ & రేడియో గైడ్
ఎలెక్ట్రికల్ ఇంజనీరింగ్, రేడియో రిపేరింగ్, రేడియో మెకానిజం రేడియో అసెంబ్లింగ్, ఎలెక్ట్రికల్ సూపర్‌వైజరీ, వైరింగ్, పూర్తికోర్సు చదవండి. రు.50లకు ట్రాన్సిస్టర్ రేడియో తయారుచేయడంకూడ నేర్చుకోండి. ఎలెక్ట్రికల్ వర్క్‌షాప్ ప్రారంభించండి. (800 పటములు) ధర రు. 12/50. VPP రు. 2 అదనం.
350 జపానీస్ పరిశ్రమల గైడ్
పెన్సిళ్ళు, ప్లాస్టిక్ సామానులు, సోపులు, ఫౌన్‌టెన్ పెన్నులు హేండ్‌లూం వగైరా 350 జపానీస్ పరిశ్రమలు, తక్కువ పెట్టుబడితో ప్రారంభించండి. ప్రతిపరిశ్రమయొక్క సాంకేతిక వ్యాపారరహస్యాలు, గవర్నమెంటు సహాయం ఋణంపొందు మార్గాలు ఈపుస్తకంలో గలదు. ధర రు. 12/50. V.P.P. రు. 2/25 అదనం.
SULEKHA BOOK DEPOT (APB)
Phapala, Aligarh

ఏర్ కింగ్ ట్రాన్‌సిస్టర్
జపాన్‌లో తయారైన పాకెట్ రేడియో, పెద్ద రేడియో వలె పని చేయును. అన్ని ట్రాన్‌సిస్టర్లు, లౌడ్ స్పీకర్లు గ్యారంటీగలవి. జపానులో తయారైనవి.



కోరినచోట సంగీతం, వార్తలు వినవచ్చు. స్థానికంగా ప్రసారంలోని ప్రతిస్టేషను వినవచ్చు. నిముటకుసిద్ధంగాపంపబడును. టార్చి సెల్‌తో పని చేయును అనువైనది అందమైనది. సోపుపెట్టె వలె చిన్న సైజు తేలికైనది. 3 సం॥ గ్యారంటీ. డీలక్స్ రకం నెం: Am55 రు 45/50 V.P.P. చార్జీలు రు. 4. రేడియో తోలుకేసు రు. 5.
SULEKHA TRADERS (AP-49)
Phapala, Aligarh

# విక్రమార్క-సింహాసనం

గట్టిగా నిట్టూర్చాడు.

నాకు నవ్వు వచ్చింది.

ఇంతలో నిట్టూర్పుల మీద నిట్టూర్పులు వినిపించ సాగాయి.

ఇక లాభం లేదనుకుని ఒక పెద్ద ప్లేటు నిండుగా పకోడీలు పట్టికెళ్లి ఆయన ముందుంచాను. అంతే ఇక నిట్టూర్పులు ఆగిపోయాయి. సావధానంగా తినడం సాగించాడు. అసలే ఆయన్ది భల్లూకప్పట్టని ప్రసిద్ధి. తిరుపతి నుంచి తెచ్చిన ఒక పెద్ద లడ్డును సైతం ఒక్కసారిగా నోట్లో కుక్కుకొని, ఒక్క గుటకలో మింగగల డంటారు. మీరు నమ్మకపోవచ్చు ? అంతటి అసాధారణ మానవు డాయన ! మొదటిసారిగా ఆయన పరిచయ భాగ్యం పొందిన నాడే ఈ పై విషయాలన్నీ గమనించి లోకులు చెప్పిన్దాన్లో యే మాత్రం అతిశయోక్తి లేదని గ్రహించి స్తంభించి పోయాను. తరువాత్తరువాత అలా ఆశ్చర్య పడడం మానుకున్నాము. 'కొత్తొక వింత !— పాతొక రోత ? ?' అని నానుడి. అది నిండు నిజం. వింత కలిగించే విషయం కొన్నాళ్లు పోయాక సర్వసాధారణ విషయం గానే కనిపిస్తుంది కదా !

అంతలో 'చింతామణి' తాలూకు సుబ్బిసెట్టిలాంటి మానవుడొకాయన 'బుడుగో బుడుగో' మంటూ వచ్చి, పంతులుకు కాస్త అవతలగా ఉన్న స్టూలును అతి కష్టమ్మీద వంగి పంతులు కెదురుగా లాక్కుని కూర్చున్నాడు.

"మీ కథేమిటండీ" అన్నాడు పంతులు— పకోడీల పళ్లేన్ని అతనికి కనిపించకుండా పడక్కుర్చీ కింద దాస్తూ.

"మీరు ఎనభై పర్సెంటు రిజల్టు ఇచ్చారే ఇదేమన్నా బాగుందా ?" అచ్చు సుబ్బిసెట్టిలా అరిచాడాయన.

"ఏం ? ఎంతివ్వ మంటారేమిటి ? తొంభై పర్సెంటు ఇవ్వాలా— సెంట్ పర్సెంటివ్వాలా ?" కోపంగా మొహం పెట్టాడు పంతులు.

"అది కాదుసార్ ! ఎంతిచ్చినా యాభై అయిదూ, అరవై దాటగూడదూ !.... మా పిల్లకాయ స్టాండర్డు మాకు తెలీదంటారా ? 'ఓ' అంటే 'నా' రాదు వాడికి ! అలాంటి వాడు ఫస్టు ఫారం యెలా పాసయ్యాడు చెప్పండి !"

కాసేపటి వరకూ ఆశ్చర్యంలోంచి తేరుకోలేక పోయాడు పంతులు. (అఫ్ కోర్స్.... నేను కూడా ననుకోండి!)

"ఇది మరీ ఆశ్చర్యంగా ఉంది. యెలా ఫెయిలయ్యామూ అని వచ్చిన వాళ్లున్నారు గానీ ఎలా ప్యాసయ్యామూ అని వచ్చిన వాళ్లంత వరకూ లేరు !" ఈ విషయం నమ్మలేనట్టు మొహం పెట్టాడు.

"అది గాదు మాస్టారూ ! ఇప్పుడో భవనం నిర్మిస్తున్నామనుకోండి. పునాదులు సరిగ్గా లేకపోతే అదెలా నిలబడుతుంది ? అలాగే లోయర్ ఫారాల్లో పునాది లేక పోతే ముందు ముందు కష్ట మవుతుంది. ఇప్పుడెలాగో కొట్టు కొచ్చా డనుకోండి. దయచేసి మళ్లీవాడు అదే క్లాసు చదివేలా చూడండి !

"ఏమిటీ ప్యాసయిన వాణ్ణి మళ్లీ ఫైలు చేయమంటారా ?" తన చెవులను తనే నమ్మలేక అడిగాడు పంతులు.

"అది కాదండీ ! ఇప్పుడు సంవత్సరపు పరీక్షల మార్కులు మాత్రమే చూడరు. క్లాసు పరీక్షల మార్కులూ, క్వార్టర్లీ హాఫియర్లీ పరీక్షల మార్కుల మార్కులూ— అన్నీ కలిపి మొత్తంగా చూస్తారు. ఒక వేళ క్లాసు మార్కులు బాగా రాకపోతే ఇందులో బాగరాసీ ప్రయోజనం లేదు. వాటిల్లో బాగా రాసి వీట్లో కాస్త తక్కువ వచ్చినా ఫర్వాలేదు ! ఇవన్నీ కొత్త రూల్సు !

"ఏం రూల్సో ఏమో ! ఇన్నేళ్లుగా చూస్తున్నా.. ఈ రోజున్న రూల్సు రేపటికుండవు !... ఇంతకీ చెప్పండి ! మళ్లీ మా వాడి నా క్లాసులోనే ఉంచాలంటే యేం చెయ్యాలంటారు ?

పంతులు కాసేపు ఆలోచన్లో పడ్డాడు:

"ఏం లాభం లేదండి. ఫెయిలయిన వాళ్లను ప్యాస్ చేయించడం యెంత కష్టమో ప్యాసయిన వాళ్లను ఫెయిల్ చెయ్యడం అంతే కష్టం !... అయినా ఓ చిన్న సలహా ! మీకు కావాలంటే ఈ సంవత్సరం మీ వాడిని స్కూల్లో చేర్పించకుండా ప్రయివేటు ట్యూషన్ చెప్పించండి !

"మంచిదండి !.... అయితే మీ స్టాఫ్పులో యెవరన్నా బాగా చెప్పగలవారున్నారాండీ?

"అదీ నేనే చెప్పాలిటండీ !.... అయినా నోరు తెరిచి అడిగారు కనుక చెబుతున్నా వినండి ! కొత్తగా బళ్లోకి ఉద్దండుడైన ఓ పంతులొచ్చాడు! ఆయనకు కుర్రాళ్లు సరదాగా కరక్కాయ పంతులనే పేరు కూడా ఇచ్చారు. కాస్త డబ్బు యెక్కువ తీసుకున్నా చాలా బాగా చెబుతాడు ! మీరే అతడి దగ్గరకు వెళ్లకండి ! సంకోచమేం లేకుండా కుర్రాణ్ణే అతడి దగ్గరకు పంపండి !.... ఏం..."

నాకు నవ్వాగింది కాదు !... బ్రహ్మాండమైన బుర్ర పంతుల్ది. తనను తనే 'రెకమెండు' చేసుకుంటున్నాడన్న మాట ! కాస్త 'ఇన్టర్నేషనల్ పబ్లిసిటీ' ఇప్పిస్తే అమెరికా వాళ్లో, రష్యనులో ఈయన గట్టి బుర్రని ఎంత డబ్బైనా పెట్టి కొనేయగలరేమో !

"అలాగే సార్?"

"మీరు వెళ్లి అడిగితే అతను ఒప్పుకోడు ? కుర్రాడు చాలా బుద్ధిమంతుడని ఆయననుకుంటే చెబుతాడంతే ! ముందుగానే హెచ్చరిస్తున్నా !... మర్చిపోకండి ! కుర్రాణ్ణే పంపండి !.... ఆఁ ?"

"అలాగేసార్ !" అంటూ సెలవు తీసుకోడానికి లేవబోతుండగా ఆయన ముక్కుపుటాలు అదిరాయి. గట్టిగా గాలిలోనికి పీల్చి అటూ ఇటూ చూశాడు. కాసేపటి కాయన దృష్టి నిశ్చలమై పంతులుగారి పకోడీల పళ్లెం మీద నిలిచింది. "పకోడీలా ! అనుకున్నాముందే !" అనుకుంటూ కాబోలు నోరు చప్పరిస్తూ మళ్లీ కూలబడి పోయాడు. పంతులు మొహం చూసి జాలిపడ్డాను.

పంతులు విధిలేక మర్యాదకోసం ప్లేటు అందిస్తూ "తీసుకోండి" అని నవ్వుతూ (!) అన్నాడు.

"అబ్బే యెందుకులెండి !" మొహమాటపడ్డాడు చెట్టిగారు.

"ఫర్వాలేదు తీసుకోండురు !" అని ప్లేటు వెనక్కు తీసేసుకోంటుండగా ఆ చెట్టిగారు పరిస్థితి మించిపోగలదని గ్రహించిన వాడై తన కబంధ

హస్తాన్ని ముందుకు చాచి ఒక పిడికెడు గ్రహించి తన గొంతులో పోసుకున్నాడు. ఒక వైపున నను ల్యాసే రెండో పట్టుపట్టబోగా— కుచేలుడి ముల్లెలో ఉన్న అటుకుల్లోంచి రెండో పిడికెడు అటుకులు సంగ్రహించ బోతున్న శ్రీ కృష్ణ పరమాత్మను రుక్మిణి వారించినట్టు — నేను ఈయనని వారిద్దామనుకున్నాను గానీ నాకీ ఆలోచన వచ్చేటప్పటికీ సమయం మించిపోయింది. పంతులు ఖాళీ అయిపోయిన ప్లేటువైపే దీనంగా చూసుకొంటున్నాడు. అంతలో మరచెంబుడు మంచి నీళ్లు తాగేసి ఖాళీచేసి— "క్షమించండి. నాకు కాఫీ, టీ అలవాటు లేదు ! నే వెళ్లొస్తా ! సెలవు !" అంటూ నిష్క్రమించాడు చెట్టిగారు.

మళ్లీ ఇంకొన్ని పకోడీలు పంతులుకేద్దామా అనుకున్నాను గానీ అంతలోనే అతడి దురదృష్టం కొద్దీ—

"వణక్కం సార్ !" అని వినబడింది.

తెల్లపంచ (హతోస్మి— ఆ పంచెకున్న రంగు తెలుపంటారు! అని అనకండి ! అవి 'ఒరిజనల్'గా తెలుపు కాదనగలరా ? ! ) భూప్రపంచంలో యెవరూ వాడని రంగుగల షర్టూ తొడుక్కొని ఉన్నాడు. ఇటీవలే కంటి ఆపరేషను చేయించుకున్నట్టున్నాడు. ఎడమకంటికి అడ్డంగా ఒక చిన్న గుడ్డ ఆకుపచ్చరంగు గుడ్డ కట్టుకున్నాడు. కరక్కాయ పంతులు కేసి ఒంటి కంటితో ఉరిమి చూస్తూ— "అడడడడా.. రొంబ అన్యాయం సార్ !" అంటూ మొదలెట్టాడు.

ఈ కొత్తరకం "ఇంట్రొడక్షన్" ఏమిటా అని ఆశ్చర్య పోయినా తమాయించుకొని "ఏమిటయ్యా నీ సోది ?" అన్నట్టు మొహం పెట్టాడు.

"నిన్నదా చూస్తిని.. మా వాడు పాస్ ! ఇవేళ ఫేలని ఉండాది !.. ఏంది సార్ అన్యాయం ? !"

పిచ్చాడా అన్నట్టు అనుమానంగా చూశాడతని వైపు.

"అమసార్ ! నిన్న వానుదాసూస్తిని మా వాడు పాస్ ! ఇయేల ఫేల్ !"

"అంటే నీ ఉద్దేశం ?...."

"ఈడ ఉద్దేశమేముండాది సార్ ! ఒరు మాటు పాసయిన వాడు మల్లా ఫెయిలెట్టా అవుతాడు ? నిన్న నాలుగు బల్లల మీద రిజల్టు వేస్తిరి. ఈయేల అంజి బోర్డ్ ఇరికీ !నిన్న నల్ల కార్బను మీద టైపు చేసిన కాయితాలు అంటేస్తిరి. ఇయేళేమో యెర్రకార్బన్‌లో ఉండాది. యేందిసార్— వీదాళ్ల మీదనా అన్యాయం ?" గడగడా కంఠోపాఠం చేసిన పాఠంలా అప్పచెబుతున్నాడు.

పంతులికేం, అర్థమయినట్టు లేదు. ఏం చెబుతాడో అనుకున్నా. అయినా పంతులేం వెనక్కి తగ్గలేదు.

"ఏమిటయ్యా నువ్వనేది ? నిన్న బోర్డు వేసి ఇవాళ మార్చారనా ? నీకేమైనా తెలివుందీ ? అలా ఎక్కడైనా జరుగుతుందా ? నీవు సరిగ్గా చదువుకొని ఉండవు. వెళ్లి సరిగ్గా చూడు !"

"నా కెందుకు తెలీదు ? నేనూ చదువుకున్న వాడినే !" అన్న మాటలు ఇంగ్లీషులో అన్నాడా అరవతను.

"ఆఁ ఆఁ ! చదువుకొన్నావు !.. చదూకోడమంటే నాలుగు యెంగిలిపీసు ముక్కలు బట్టీ పట్టి వాగడం కాదు !.... ఎక్కడైనా రోజుకో బోర్డు వేస్తారుటయ్యా !"

"వెయ్యకపోతే నాలుగు బోర్డులైదెలా అవుతాయి ? నల్లకార్బను యెర్రకార్బనుగా యెలా మారుతుంది ? మాకేం తెలీదను కోకయ్యా ! మాకూ బాగా తెలుసు !" ఇంగ్లీషులోనే అన్నాడు.

"ఏం తెలుసయ్యా నీకు ? నీ బొంద తెలుసు ! అర్థం చేసుకోలేకపోతే సరి ! ఏదో పొరబాటు చూచి ఉంటావు. అందులో ఒక కన్ను కూడా లేదాయె ! వెళ్లి సరిగ్గా చూసి ఏడు !"

"సామీ ! ఏడూ గీడూ అనకూ !"

"ఏం ? ఏం చేస్తావయ్యా. మహా గొప్పగా వచ్చావు ? వడవ్వయ్య నడు ! బుద్ధి లేకపోతేసరి. పెద్దగా తయారవుతారు ప్రతి అడ్డసన్నాసీను !" పంతులు గొంతు చించుకో సాగాడు.

"ఏమిటోయ్ పంతులూ పెంకు లెగరేస్తున్నావ్ ?"

ఉలిక్కి పడ్డాన్నేను. నాన్నగారి గొంతది. నాన్నగారెప్పుడు మేడమీదనుంచి దిగారో, ఎప్పుడు మొహం కడుక్కున్నారో గమనించనే లేదు నేను— ఈ సందడిలో.

ఈమాటు కరక్కాయ పంతులు గొంతులో వెలక్కాయ పడ్డది. తడబడుతూ— "మీరు ఇంట్లోనే ఉన్నారాండీ ?" అనడిగాడు.

"ఆ ! నిద్ర పోతున్నాను· కాఫీ టిఫిన్లయ్యాయా ఎవరండీ మీరు ? ఏంకావాలి ?" అన్నారు నాన్నగారు ఒంటికంటి అరవాయన కేసి చూస్తూ.

"మీరు దానా హెడ్మాష్టరు ?"

"అవును నేనే ! ఏం కావాలి మీకు ?"

అరవాయన పంతులుకేసి ఒకసారి గుడ్లురిమి చూసి మళ్లీ గ్రామఫోను ప్లేటులా,— 'రొంబ అన్యాయంతో' మొదలెట్టి 'నేనూ చదువుకొన్న వాడినే' అన్నదాకా వాగేశాడు.

"ఏమండోయ్, మీరు పొరబడ్డారు ! లోయర్ ఫారమ్సన్నీ ఎర్రకార్బన్‌తోనూ హయ్యర్ ఫారమ్స్‌న్నీ నల్లకార్బన్‌తోనూ టైపు చేశాము. మరి మీరు ఏది చూశారో !" అన్నారు నాన్నగారు.

అరవతను కాసేపు తన గీరుకొని "మరి బోర్డుల సంగతో ?" అన్నాడు.

"అది కూడా గమ్మత్తే, ఓ పెద్ద బోర్డుకు మధ్యలో అతుకు చీలలు వూడి పోయి ఉంటే— ఈ సమయానికి వేరే బల్లలు దొరకక పోవడం చేత దాన్నే జోడించి పెట్టేశాము ! పిల్లల తోపుడికి మళ్లీ అది రెండుగా విడిపోయి ఉంటుంది !"

దాంతో ఆ అరవతని చిక్కుముడి కాస్త వూడి పోయింది.

"మరి మా వాడి సంగతో ?" అన్నాడతను.

"రేపు ఆఫీసులో కనుక్కోండి ఆ విషయాలన్నీ ఇక్కడ కాదు"

అతగాడు మరేం మాట్లాడకుండా పంతులి వైపొక ఉగ్రంగా ఓమాటు చూసి వెళ్లిపోయాడు.

"గుడ్డి వెధవ ! కళ్లు సరిగ్గా కనపడక పోతేసరి! పిచ్చిపిచ్చిగా వాగుతున్నాడు. పైగా తనూ చదువుకొన్న వాడినంటాడు. ముందు జాగర్త తీసుకోరు. తర్వాత దాపురిస్తారు !" పంతులు ప్రారంభించాడు. అతణ్ణి తిట్టడం.

"అయినా నువ్వు పడుతున్న గొడవేమిటోయ్ పంతులూ ?"

పంతులు కాసేపు తటపటాయించి— "ఏం లేదండి ! అబ్బాయ్ మీరు లేరన్నాడు ! సరే కదాని ఈ పడక్కుర్చీలో కాసేపు కూర్చున్నా. ఇందులో కంఫర్టూ అదీ చూస్తూంటే నేనూ ఒక హెడ్మాష్టర్నయితే యెంత బావుడ్ను అనిపించింది. పైగా రెండు వేల మంది విద్యార్థులున్న స్కూలు ! ఇంతలో పిల్లలంతా రావడం మొదలెట్టారు. పడక్కుర్చీలో దర్జాగా ఉన్న నన్ను చూసి హెడ్మాస్టరనుకున్నారు. "మీరు ఇంట్లో లేరుకదా. రూల్సన్నీ తెలుసుకదా ! అని కాసేపైనా హెడ్మాస్టరు గిరీ అనుభవిద్దామనుకున్నాను. వచ్చిన వాళ్లందరి యొక్క ప్రశ్నలకీ యెలాగోలా సమాధానమిచ్చా ! కానీ బాబోయ్— ఓ గంట హెడ్మాష్టరు గిరికే ఇంత ఇదయితే రోజంతా ఎలాగుంటుందో...." అన్నాడు.

నాన్నగారు నవ్వుతూ— "పోనీ స్కూలు తెరిచే దాకా ఈ గిరీ అనుభవిద్దూగానిలే !" అన్నారు.

"బాబోయ్ వద్దండి !" అన్నాడు పంతులు.

"ఇంతకీ విశేషాలేమిటోయ్ పంతులూ ! కనబడ్డమేలేదే ఈ మధ్య ? ? ఏమిటీ సంగతులూ, ఎందుకొచ్చావ్ ?.... ఆఁ ?"

"అబ్బే యేం లేదండీ ! మా బావమరిది స్నేహితుడి కొడుకొకడు ఫెయిలయ్యాట్ట ! అబ్బాయి చాలా బుద్ధిమంతుడల్లే కనబడతాడు మరి ! ఎలా ఫెయిలయ్యాడో తెలీదు ! వాడి మార్కులొమాటు చూచి పోదామని !...." నసిగాడు పంతులూ.

"ఓరి పంతులూ ?" అని ఆశ్చర్య పోయాను. మొత్తానికి భలేవాడే ! ఇంత మందికి తనే పని కూడదని చెబుతున్నాడో అదే తను చెయ్యాలనుకొంటున్నాడన్న మాట ! అసలు స్కూలు తెరిచే దాకా మార్కులు గుప్తంగా ఉంచడం నాన్నగారి 'పాలసీ'. నాన్నగారేమంటారో అన్న సందేహం వచ్చింది. ఎందుకంటే— ఏం చెప్పినా పంతులు సులభంగా బోల్తా పడడు కదా ?

"దానికి నువ్వు పని కట్టుకు రావాలిటోయ్ పంతులూ ! రేపు సాయంత్రం ఎవర్నయినా కుర్రాణ్ణి పంపు. ఆఫీసు నుంచి తెప్పించి పెడతాను ?" అన్నారు నాన్నగారు సహజంగా నవ్వుతూ.

పంతులు చిరునవ్వు చిందించాడు. కానీ పంతులికేం తెలుసు ఏ పం— నాన్నగారు రేపుదయమే వూరెడుతున్నట్టు ! సులభంగానే బుట్టలో పడ్డాడు పంతులు.....

అంతవరకూ కథకు 'వస్తువు' దొరకని నా బుర్రలోని కవాటం 'ధన్' మని తెరుచుకొంది. ఆ రాత్రే దాన్ని కథగా రాసి నాన్నగారికి చూపెట్టి— "పేరేం పెట్టమంటారు ?" అని అడిగాను.

"నువ్వే చెప్పు !"

"పడక్కుర్చీ— పకోడీలు !"

"ఛ !.... 'విక్రమార్క సింహాసనం' అని పెట్టు ! పడక్కుర్చీ సింహాసనమూ, మధ్యలో వచ్చే పాత్రలన్నీ సాలభంజికలూ !"

"వెరీ గుడ్ ! థాంక్యూ పాప్పా !"

"కానీ పంతులిది పత్రికలో చదివితే ఏమను కుంటాడో ?".... అన్నారు నాన్నగారు నవ్వుతూ.

ఏమనుకుంటాడో మరి— మీరే చెప్పాలి ! పంతులుచెప్పినాఫర్వాలేదు!ఇకఉంటా—టాటా!! ★